గొప్ప వైద్య వేత్త డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న డాక్టర్ రణదీప్ గులేరియా, డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి తదితరులు

నల్లకుంట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మూడు పద్మ అవార్డులను స్వీకరించిన తొలి వైద్యుడు, గొప్ప వైద్య వేత్త డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి అని పలువురు వక్తలు అభివర్ణించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నార్త్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 5వ ఐఎంఏ తెలంగాణ స్టేట్ కన్‌హ - 2025 కార్యక్రమంలో భాగంగా ప్రపంచ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఏఐజీ చైర్మన్ డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి దంపతులను బుధవారం నగరంలోని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎయిమ్స్ న్యూఢిల్లీ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ రణదీప్ గులేరియా, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తన వైద్య ప్రయాణంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.సురేంద్రనాథ్, డాక్టర్ జి.ఆర్.గణేష్‌రావు, డాక్టర్ బి.సాయిసుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

11వ విడత ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ సృజన, ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 11వ విడత ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని ప్రారంభించామని మహిళ, చిన్న పిల్లల రక్షణ విభాగం డీసీపీ కె.సృజన తెలిపారు. బుధవారం సైబరాబాద్ కమిషనరేట్‌లో చైల్డ్ ప్రొటెక్షన్ సెల్, పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సృజన మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రతి ఏటా జూలైలో ఆపరేషన్ ముస్కాన్‌ను పోలీసులు, చైల్డ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులతో కలిసి చేపడుతున్నామని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జూలై 1 నుంచి 31 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి మహిళలు, చిన్నారులను అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు బాలకార్మికులను రక్షిస్తామని తెలిపారు. సమావేశంలో ఏసీపీ కె.సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా పిల్లల సంరక్షణ కమిటీ ప్రతినిధి కె.నాగేందర్‌రెడ్డి, మేడ్చల్ ప్రతినిధి రాజారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి శ్రీలతతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

'సిగాచి యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి'

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడిన సిగాచి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక హైదరాబాద్ యూనిట్ అధ్యక్షుడు సురేష్ బాబు డిమాండ్ చేశారు. సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన భారీ పేలుడు, తద్వారా జరిగిన తీవ్ర ప్రాణనష్టం పైన మానవ హక్కుల వేదిక బృందం బుధవారం నిజనిర్ధారణ జరిపింది. ఇంకా శవాల వెలికితీత పూర్తి కాకపోవడం, కంపెనీ పేరు తప్ప యాజమాన్యం పేర్లు ఇప్పటికీ బయటికి రాకపోవడం, మృతుల కుటుంబాలకు సమాచారం అందకపోవడం వంటి విషయాలు దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. నిజనిర్ధారణ బృందంలో మానవ హక్కుల వేదిక హైదరాబాద్ ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, కమిటీ సభ్యులు వసంతలక్ష్మి, రోహిత్ ఉన్నారు.

'57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దళితులలో అత్యంత వెనుకబడిన ఎంబీసీ 57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని 57 ఎంబీసీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మాల దాసరి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బైరి వెంకటేష్ మాట్లాడుతూ దళితులకు వచ్చే అన్ని ఫలాలు అట్టడుగున ఉన్న 57 కులాలకు కూడా దక్కాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మాల దాసరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మద్దెల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'దేశ ప్రజల ప్రయోజనాలు ట్రంప్ వద్ద తాకట్టు'

హిమాయత్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ప్రయోజనాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దగ్గర మోదీ తాకట్టు పెట్టారని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లాఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూర్ ధర్మేంద్ర ఆరోపించారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులపై దాడులు జరుగుతున్నా.. మోదీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అమెరికాలో భారతీయులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం చలో అమెరికన్ కాన్సులేట్ కార్యక్రమాన్ని చేపట్టారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి ప్రారంభమైన నిరసనను సమీపంలోనే అడ్డుకుని నేతలను అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిరసన కార్యక్రమంలో సమాఖ్య నేతలు శ్రీనివాసులు, సల్మాన్‌బేగ్, కల్యాణ్, నాగరాజు, మధుకర్, సునీల్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కృషి చేయండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎమ్మెల్సీ కవిత లేఖ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం దక్కేలా కృషి చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం ఓ లేఖ రాశారు. రాష్ట్రపతి ఆమోదానికి బిల్లులు పంపి చాలాకాలం అవుతోందని, బీసీలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు ఆమోదం తెలిపేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

స్పోర్ట్స్ పాలసీలో విజన్ కొరవడింది

- శాట్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త స్పోర్ట్స్ పాలసీలో విజన్ కొరవడి.. లోపభూయిష్టంగా ఉందని శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం అబిడ్స్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేసేందుకు అవసరమైన హై పెర్ఫార్మెన్స్ అకాడమీల స్థాపనపై నూతన క్రీడా విధానంలో కనీస ప్రస్తావన లేదని విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా పెంపు, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు నెగ్గిన వారికి ఇచ్చే ఉద్యోగాలపై పాలసీలో స్పష్టత ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. శాట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కోచ్‌ల క్రమబద్ధీకరణ, కొత్త కోచ్‌ల నియామకాలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. స్టేడియాలు, స్పోర్ట్స్ స్కూళ్ల ఆధునీకరణపై దృష్టి పెట్టాలని వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు.

మణికొండలో రూ. కోటిన్నర విలువైన డ్రగ్స్ స్వాధీనం

- ఇద్దరు స్మగ్లర్స్ అరెస్ట్

నార్సింగ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మణికొండ మున్సిపాలిటీ వైఎస్ఆర్ కాలనీలో రూ. కోటిన్నర విలువైన 650 గ్రాముల హెరాయిన్ డ్రగ్స్, 84 గ్రాముల పాపీస్ట్రా మాదక ద్రవ్యాలను ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న ఇద్దరు వ్యక్తుల వద్ద డ్రగ్స్ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మాదక ద్రవ్యాలను రాజస్థాన్ నుంచి నగరానికి దిగుమతి చేసుకున్నట్లు తెపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ఎల్‌బీనగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికవర్గాన్ని బలిచ్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి మల్లెపాక వీరయ్య, రంగారెడ్డి జిల్లా ప్రైవేటు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అధ్యక్షుడు కడారి రాములు డిమాండ్ చేశారు. జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను కొత్తపేట చౌరస్తాలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. జూలై 9న జరుగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వారు కోరారు. సీఐటీయూ నాయకుడు కొంటిగర్ల రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాములు, రమేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, తిరుపతయ్య, రాము, విష్ణు, శ్రీను పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటీయూసీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో కుంట్లూర్ ఆర్ఎన్ఆర్ కాలనీ సీపీఐ కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డితో కలిసి రవీంద్రాచారి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, ఫిక్స్‌టర్మ్ అప్రెంటీస్, థర్డ్ పార్టీ ట్రైనీలుగా పని చేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, నరసింహ, ప్రసాద్, నవనీత, అరుణ, బాల్‌రెడ్డి, బిచ్చు, యాదగిరి, సైదులుముదిరాజ్, రవి, ముత్తయ్య, దేవమ్మ, సుజాత పాల్గొన్నారు.



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకులు రవీంద్రాచారి, యాదిరెడ్డి తదితరులు

సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు..

ఈనెల 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు అబ్దుల్లాపూర్‌మెట్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రసన్న లక్ష్మీకి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకుడు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎలకపల్లి మహేష్, రమాదేవి, యమునా, స్వరాజం, సుహాసిని, జ్యోష్ణ పాల్గొన్నారు.



తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు కిషన్, సిబ్బంది

హయత్‌నగర్ : జూలై 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో మున్సిపల్ కార్మికులందరు పాల్గొంటారని పేర్కొంటూ సమ్మె నోటీసును బుధవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి. కిషన్ తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిషన్ మాట్లాడుతూ 44కార్మిక చట్టాల నుంచి 24 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. లేబర్ కోడ్ అమలు జరిగితే కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడం కష్టతరం అవుతుందన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు, అవకాశాలు కోల్పోతారని తెలిపారు. కార్యక్రమంలో మహేష్, రవి, సుధాకర్, వెంకటేష్, అంజయ్య, సరిత, నరేష్, మంజుల పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి : కమిషనర్

సరూర్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో వీధి వ్యాపారుల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ పి.సరస్వతి సూచించారు. వీధి వ్యాపారులకు ప్రభుత్వం రూ.పది వేలు చొప్పున రుణం అందజేస్తుందని, ఈ అవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వీధి వ్యాపారులతో ఎదురవుతున్న సమస్యలపై బుధవారం మునిసిపల్ కార్యాలయంలో మీర్‌పేట్, బాలాపూర్ పోలీసులతో కలిసి ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ఏయే ప్రాంతాల్లో వీధి వ్యాపారుల వల్ల సమస్యలు తలెత్తుతున్నాయో గుర్తించి, వారిని అక్కడి నుంచి గ్రీన్ జోన్‌లకు తరలించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. సదరు వ్యాపారులకు బ్యాంకులు రుణం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని, రుణ సదుపాయాన్ని వినియోగించుకుని గ్రీన్ జోన్లలో వ్యాపారాలు నిర్వహించుకోవాలని సరస్వతి సూచించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ ఏఎంసీ జాన్ కృపాకర్, డీఈఈ వెంకన్న, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, టీఎంసీలు మమత, నాగేశ్, శంకర్, పర్యావరణ అధికారి మౌనిక, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ సరస్వతి



విద్యుత్ భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఆస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి

ముగిసిన విద్యుత్ భద్రతా వారోత్సవాలు

చాదర్‌ఘాట్, జూలై 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది విద్యుత్ భద్రతా సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తూ జూన్ 26న ప్రారంభమైన విద్యుత్ భద్రతా వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈమేరకు ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోకి వచ్చే సబ్‌స్టేషన్ల వారీగా విధులను నిర్వర్తించే విద్యుత్ సిబ్బందికి భద్రతా సూత్రాలపై డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీఈలు పవన్, శోభన్, వినోద్‌రెడ్డి, ఏఈలు శ్రీనివాస్ రెడ్డి సత్యనారాయణ, నరేందర్, సంతోష్, ప్రసాద్, సోహెల్, భాస్కర్, సుశాంత్‌రెడ్డి, గోవింద్‌రావు, శ్రీనివాస్, రాకేష్‌లతో కూడిన బృందం అవగాహన కల్పించింది.

ఘనంగా లక్ష పుష్పార్చన

ఎల్‌బీనగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళపీఠం ప్రత్యంగిరా దేవి ఆలయంలో వారాహీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సిద్ధేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతులు దత్తేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో అమ్మవారికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. అమ్మవారికి లక్ష పుష్పార్చన చేశారు. నవరాత్రుల్లో భాగంగా 18రకాల ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, మహానక్షత్ర హారతులు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త అనంత లక్ష్మి ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్, మునిపల్లె సువర్ణలత, విజయలక్ష్మి, వర్ధని, ఆకెళ్ల అనురాధ, హేమ, అరుణ, రాధ పాల్గొన్నారు.

మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలి: శ్రీధర్‌రెడ్డి

సరూర్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌లో భాగంగా బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు ఏనుగు రాంరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్‌తో కలిసి ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరికి వారు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యయాదవ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తర్రె మల్లేశ్‌యాదవ్, బడంగ్‌పేట్ శాఖ-2 అధ్యక్షుడు వీరకర్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాదర్‌గుల్‌లో మొక్కను నాటుతున్న శ్రీధర్‌రెడ్డి, శ్రీరాములుయాదవ్ తదితరులు

మీర్‌పేట్ సమస్యలపై కలెక్టర్‌కు సీపీఐ వినతి

సరూర్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మొత్తం 42 డివిజన్ల పరిధిలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవీంద్రాచారి, మహిళా సమాఖ్య కార్యదర్శి యాదమ్మ, గిరిజన సమాఖ్య నాయకులు పాండునాయక్, చత్రునాయక్ తదితరులు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అధికారులు స్పందించి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

బడంగ్‌పేట్ స్కూల్ భవన నిర్మాణం పూర్తి చేయాలి

సరూర్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌లోని దావూద్‌ఖాన్‌గూడలో గత ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన పాఠశాల నూతన భవనం నిర్మాణం నేటికీ పూర్తికాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ దృష్ట్యా సదరు భవనం నిర్మాణాన్ని తొందరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పాత పాఠశాలతో పాటు కొత్త భవనాన్ని సైతం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుత పాఠశాలలో గదుల కొరత కారణంగా విద్యార్థులు ఆరుబయట కూర్చుని పరీక్షలు రాస్తుండడాన్ని గమనించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరానికి కొత్త భవనాన్ని అందుబాటులోకి తెస్తామంటూ అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ మేయర్ పారిజాతారెడ్డి హామీలు గుప్పించారని, అయినా నేటికీ అతీగతీ లేదని ఆయన ఆరోపించారు. నాయకులు, అధికారులు భవన నిర్మాణ పనులను పరిశీలించి వెళ్లడం తప్ప తొందరగా పూర్తి చేసే దిశలో చర్యలు తీసుకోకపోవడం గర్హనీయమని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సైదులు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి వాంబేకాలనీలో పోలీసుల కార్డన్‌సెర్చ్

- 52బైక్‌లు, నాలుగు ఆటోలు సీజ్
- అదుపులోకి 26 మంది అనుమానితులు

సైదాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగరేణి వాంబేకాలనీలో బుధవారం రాత్రి సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. వాంబే గృహాలలో ప్రతి ఇంటిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. ఈ దాడులలో సైదాబాద్ పీఎస్ పరిధిలో మూడు నెలల క్రితం నమోదైన హత్యాయత్నం కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు పోలీసులకు పట్టుబడ్డాడు. సరైన పత్రాలు లేని 52 బైకులు, నాలుగు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 26 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఐదుగురు రౌడీషీటర్లకు డీసీపీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న కేంద్రం నుంచి రెండు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు, ఫిల్లింగ్ పరికరాలను పోలీసులు పట్టుకున్నారు. బెల్ట్ షాపులలో మద్యం సీసాలను, అంతే గాకుండా ఓ వ్యక్తి వద్ద 10 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. ఈ తనిఖీలలో అదనపు డీసీపీ శ్రీకాంత్, సైదాబాద్, సంతోష్‌నగర్ ఏసీపీలు సోము వెంకట్‌రెడ్డి, సుఖ్‌దేవ్‌సింగ్‌లతో పాటు సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్‌తో పాటు జోన్ పరిధిలో 14మంది ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు 22మందితో పాటు 230 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్

100 గ్రాముల గంజాయి రూ. 4వేలు

- గుట్టుగా విక్రయిస్తున్న కారు డ్రైవర్
- 7.5కేజీల సరుకు సీజ్

హైదరాబాద్ సిటీ/చంపాపేట: 100 కేజీల గంజాయిని రూ. 2000లకు కొని.. దాన్ని రూ. 3500- 4000లకు విక్రయిస్తున్న గంజాయి స్మగ్లర్ ఆటకట్టించారు సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. అతని వద్ద నుంచి 7.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ. 1.86లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం ఎర్రకుంటకు చెందిన మహ్మద్ అమీర్(27) బుధవారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్‌లోని ఇస్మాయిల్ అనే వ్యక్తినుంచి 7.5కిలోల గంజాను తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్ టీమ్ రంగంలోకి దిగింది. కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ టీమ్‌తో కలిసి సంయుక్తంగా దాడిచేసి అమీర్‌ను పట్టుకున్నారు. అతని వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని విచారించిన క్రమంలో గతంలో కారు డ్రైవర్‌గా పనిచేసిన అమీర్.. వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో గంజాయి స్మగ్లింగ్ వృత్తిని ఎంచుకున్నట్లు తేలింది. మంగళ్‌హాట్‌కు చెందిన ఇస్మాయిల్ వద్ద 100 గ్రాముల గంజాయిని రూ.2వేల చొప్పున కొనుగోలు చేసి దాన్ని నగరంలోని పలు ప్రాంతాల్లో అవసరమైన కస్టమర్స్‌కు 100గ్రాములను రూ. 3500 నుంచి 4వేల వరకు విక్రయిస్తున్నట్లు తేలిందని అడిషనల్ డీసీపీ తెలిపారు. కేసును కంచన్‌బాగ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు అమీర్

నివాసాలు తొలగించకుండా తగిన చర్యలు: ఎమ్మెల్యే

చంపాపేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): చెరువు పక్కన నివాసం ఉంటున్న పేదల నివాసాలు తొలగించకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని బైరామల్‌గూడకు చెందిన పలువురు పేద మహిళలు బుధవారం ఎమ్మెల్యేను కలిశారు. 30సంవత్సరాల నుంచి చెరువు పక్కన నిర్మించుకున్న తమ ఇళ్లను తొలగించనున్నట్లు అధికారులు పేర్కొన్నట్లు, నివాసాలు తొలగించకుండా తమను కాపాడాలని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బైరామల్‌గూడ చెరువు పక్కన ఉన్న పేదల ఇళ్ల ముందు నుంచి బాక్స్‌డ్రైన్ నిర్మించినట్లు, పేదలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి ఎవరికి నష్టం కలుగకుండా చూసే బాధ్యత తనదని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం : కమిషనర్

హయత్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): వందరోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం తుర్కయంజాల్ పురపాలక సంఘం అధికారులు బేకరీలు, జనరల్ స్టోర్స్ స్వీట్‌హౌస్‌తో పాటు ప్లాస్టిక్‌ను ఉపయోగించే షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించే షాపుల యజమానులకు కూడా తగిన అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి అందరం కలిసి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో అధికారులు వినయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేద్దాం: శ్రీనివాస్

సైదాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేద్దామని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం సైదాబాద్‌లో నియోజకవర్గ పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సభకు ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రానున్నారని చెప్పారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు నగరిగారి దాస్, గౌరిబాయి, శంకర్‌నాయక్, రమేష్‌నాయక్, ఫిరోజ్‌ఖాన్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : రాచపుడి

కొత్తపేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను గుర్తించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపూడి తెలిపారు. బుధవారం హయత్‌నగర్ వివేకానంద హైస్కూల్ నుంచి 39మంది విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. టీటీఐ అధికారులు ట్రాఫిక్ నిబంధనలపై వారికి అవగాహన కలిపిస్తూ లెక్చర్‌హాల్‌లో యానిమేషన్ వీడియోలు, రైమ్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో హీరో మోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన టీఎన్‌జీఓ నేతలు

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల ఒకటో తారీఖున జీతాలు, పెన్షన్లు వస్తున్నందుకు గాను టీఎన్‌జీఓ రాష్ట్ర నాయకులు బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి ఖాళీలను భర్తీ చేయాలని ఈ సందర్భంగా సీఎస్‌ను కోరడం జరిగిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డి తెలిపారు. సీఎస్‌ని కలిసిన వారిలో టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, సత్యనారాయణగౌడ్, వెంకటేశ్వర్లు, ముక్రం ఉన్నారు.

ఆగస్టు 15 నుంచి ఓటర్ నమోదు

చాదర్‌ఘాట్ : మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఆగస్టు 15 నుంచి ఓటర్ నమోదు కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల న మోదుకు ప్రక్రియను సవ్యంగా నిర్వహించేందుకు బీఎల్‌వోలకు ఈనెల 8 నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఆర్‌వో, జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్ తెలిపారు. మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో 3.18 లక్షలకు పైగా ఉన్న ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన 300 పోలింగ్ బూత్‌లకు 300 మంది బీఎల్‌వోలను నియమిస్తున్నట్లు ఆయన వివరించారు. ఓటర్ నమోదుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు ఈనెల 17వరకు ముగిస్తాయన్నారు. ప్రతిరోజు 50 మంది బీఎల్‌వోలకు శిక్షణ నివ్వనున్నారు.

మీర్‌పేట్ రిటైర్డ్ కమిషనర్‌కు బీజేపీ నేతల సన్మానం

సరూర్‌నగర్ : ఉద్యోగ విరమణ పొందిన మీర్‌పేట్ మాజీ కమిషనర్ ఆర్. జ్ఞానేశ్వర్‌ను బుధవారం బీజేపీ నేతలు ఘనంగా సన్మానించారు. బీజేపీ మీర్‌పేట్ క్లస్టర్-1,2 అధ్యక్షులు పసునూరి భిక్షపతిచారి, తులసి ముఖేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, కౌన్సిల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి జ్ఞానేశ్వర్ నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి బొకే అందజేసి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కె.సోమేశ్వర్, మీర్‌పేట్, బడంగ్‌పేట్ శాఖల మాజీ అధ్యక్షులు పెండ్యాల నర్సింహ, సీహెచ్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అంధుల హాస్టల్‌ను సందర్శించిన కార్పొరేటర్

సైదాబాద్ : మలక్‌పేట బీ బ్లాక్‌లోని ప్రభుత్వ అంధుల బాలికల హాస్టల్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం హాస్టల్‌ను సందర్శించి భోజనశాలను పరిశీలించారు.

సైదాబాద్ డిప్యూటీ ఐఓఎస్‌గా వెంకట్‌రెడ్డి

సైదాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): సైదాబాద్-2 విద్యాశాఖ డిప్యూటీ ఐఓఎస్‌గా పి. వెంకట్‌రెడ్డి బుధవారం బీ బ్లాక్‌లోని మండల ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ సైదాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో వెంకట్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ హైదరాబాద్ అధ్యక్షుడు టి. తిరుపతిరెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు ఆంజనేశ్వరావు, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపేట : శ్రీశంకర్‌కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలపారు. రూ.25 లక్షలతో చేపడుతున్న కాలనీ కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ షరీఫ్, కాలనీ అధ్యక్షులు కృష్ణ, ప్రతినిధులు రమేష్‌చారి, విద్యాసాగర్, రమేష్, నాగశ్వర్‌రావు, సంగీత, భాస్కర్ పాల్గొన్నారు.